విద్యారంగంలో 'మౌలానా'సేవలు చిరస్మరణీయం



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 12 నవంబరు, 2026 | పేజీలు : 08

ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతాం



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షించి పార్టీలోకి రావడం సంతోషకరం
మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన దమ్మన్నపేట,ఆత్మకూర్ సర్పంచ్‌లు

ప్రజాపక్షం/గొల్లపల్లి : గ్రామాల సమగ్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దమ్మన్నపేట సర్పంచ్ ముదాం గౌతమి జానారెడ్డి ,ఆత్మకూరు గ్రామ సర్పంచ్,రాజం పోచవ్వ మరియు తిరుపతి యాదవ్ లు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

2లో

అక్రమ ఇంటి నెంబర్లు, అనుమతుల వ్యవహారంపై దుమారం

అధికార పార్టీ కౌన్సిలర్ ధర్నాతో బయటపడిన అంతర్గత విభేదాలు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ల కేటాయింపు, భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంటోంది. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.రాజకీయ పలుకుబడి ఉన్న వారికి ఒక విధమైన విధానం, సామాన్య ప్రజలకు మరో విధమైన నిబంధనలు అమలు అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో సరైన ఆధారాలు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, వాటికి అనుమతులు పొందడం, అనంతరం ఇంటి నెంబర్లు కేటాయించడం వంటి అంశాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు నియమాలను ఉల్లంఘించి పలు రకాల పనులను నిర్వహిస్తున్నారని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మున్సిపల్ లో ఏ ఏ విధమైన పర్మిషన్ ఇవ్వాలన్న వాటిని రద్దు చేయాలన్న మున్సిపల్ కమిషనర్ కు పూర్తి అధికారాలు ఉంటాయి. కానీ అధికారాలపై రాజకీయ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది అని పలువురు వారి

2లో

ఇంకుడు గుంతలు ఏవీ.. నీటి భద్రతేదీ!

ప్రజాపక్షం/నిర్మల్ : నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంకుడు గుంతల నిర్మాణ నిబంధనలు ఆచరణలో మాత్రం కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటుతుండగా, మరోవైపు వర్షాకాలంలో కురిసే నీటిని భూమిలోకి ఇంకించే ఏర్పాట్లపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో ఇంకుడు గుంతల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

పట్టణాల్లో కొత్తగా ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించే సమయంలో వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలోనే వీటిని పరిశీలించాలి. అయితే అనుమతులు పొందిన తర్వాత నిర్మాణదారులు నిజంగానే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నారా? లేక కేవలం కాగితాలకే పరిమితమవుతున్నారా? అన్నది అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. జిల్లా కేంద్రం నిర్మల్‌తో పాటు భైంసా,



2లో

చదువే విద్యార్థి ప్రగతికి ఆధారం



విద్యార్థి దశ నుంచే ప్రణాళిక ప్రకారం అభ్యసించాలి
కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : విద్యార్థి ప్రగతికి చదువే ఆధారంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 20 పాఠశాలల్లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద (సిఎస్ఆర్) ఇటీవల స్మార్ట్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎంపిహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ ఎంపిహెచ్ఎస్, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని తారాకరామనగర్ ఎంపిపిఎస్, తంగల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాల, తంగల్లపల్లి మండల కేంద్రంలోని ఎంపిపిఎస్, ఆర్‌టిసన్ కాలనీ ఎంపిపిఎస్, బద్దెనపల్లి జడ్పి ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం లింగన్నపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం మల్లారెడ్డి పేట ఎంపిపిఎస్, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి జెడ్‌పిఉన్నత పాఠశాల, బొప్పాపూర్, దుమాల ఎంపిపిఎస్, చందుర్తి మండలం మల్యాల జెడ్‌పి ఉన్నత పాఠశాల, సనుగుల ఎంపిపిఎస్, వేములవాడ మండలం రుద్రవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల, వేములవాడ పట్టణంలోని వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, కోనరావుపేట మండలం నిజామాబాద్, రుద్రంగి ఎంపిపిఎస్ పాఠశాలలో

2లో

రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...

ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.

అమలవుతున్న సంక్షేమ పథకాలు : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు అందించడంతో పాటు రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి వంద శాతం కృషి : అభివృద్ధిని కాంక్షించి పార్టీలో చేరిన దమ్మన్నపేట, ఆత్మకూరు గ్రామాల అభివృద్ధికి తన వంతుగా వంద శాతం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



ఇందిరమ్మ ఇంటి ప్రారంభం అండ్ పరామర్శ : అం తకుముందు మండలంలోని,రంగ దాముని గ్రామంలో లబ్ధిదారులు నర్మెట్ల మౌనిక మహేష్ దంపతులకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రా రంభించారు.అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గా యపడిన గ్రామానికి చెందిన ఎద్దు శంకరయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కా ర్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చై ర్మన్ భీమ సంతోష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ క టారి చంద్రశేఖర్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు తిరుపతి గౌడ్,రంగధాములపల్లి సర్పంచ్ ఆఖిల అనిల్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

రాజురలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని రాజూర ప్రాథమిక పాఠశాలలో భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలా ం ఆజాద్ జన్మదిన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఉపాధ్యాయులు, విద్యార్థులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్,సతీష్,ఆనంద్ గీతానిఖిల,నిహారిక,మణికంఠ,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ నూతన సిఐగా సాయినాథ్

ప్రజాపక్షం/బోథ్: బోథ్ మండల కేంద్రం లోని నూతన సిఐ గా బాధ్యతలు స్వీకరించిన డి.సాయినాథ్. వారికి బోథ్ ఎస్సై పోలీస్ బృందం స్వాగతం తెలిపారు.

బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

ప్రజాపక్షం/బాల్కొండ : మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థులు బుధవారం గ్రామీణ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా మేనేజర్ సందీప్ విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో అందించే వివిధ రకాల రుణాలు, పర్సనల్ లోన్స్, ఓవర్‌డ్రాఫ్ట్, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల వినియోగం, సైబర్ నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు తెలిపారు. ఆర్థిక లావాదేవీలు నిర్వహించేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌ల పంపిణీ

ప్రజాపక్షం/మాక్లూర్ : మండలంలోని చిక్లీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు గాను ఉపసర్పంచ్ సతీష్ ధాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులకు తన స్వంత నిధులతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ యూనిఫామ్‌లను బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ అశోక్, ఉపాధ్యాయ బృందం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూమన్న, నరేష్, చిన్నరాజన్న, లడ్డు, షబ్బీర్, నవీన్, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏవీ.. నీటి భద్రతేదీ!

(మొదటిపేజీ తరువాయి)



ఖానాపూర్ పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు పెరుగుతున్నాయి. సిమెంట్ రోడ్లు, భవనాల నిర్మాణాలతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. ఇలా ంటి పరిస్థితుల్లో ప్రతి భవనంలో ఇంకుడు గుంతల ఏ ర్పాటు ఎంతో అవసరం. కానీ ఎన్ని నిర్మించారు? ఎన్ని ప నిచేస్తున్నాయి? ఎన్ని నిరుపయోగంగా మారాయి? అనే వి వరాలను మున్సిపల్ అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.నిర్మాణ అనుమతుల సమయంలో ఇంకుడు గుంతల పేరుతో డిపాజిట్లు వసూలు చేసి, క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మూడు పట్టణాల్లోనూ అలాంటి పరిస్థితులు ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరగాలి. కేవలం పత్రాల్లో చూపించడం కాకుండా వాస్తవంగా ఇంకుడు గుంతలు నిర్మించారా? వాటిలోకి వర్షపు నీరు చేరుతోందా? నిర్వహణ సక్రమంగా ఉందా? అన్నది పరిశీలించాలి. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలు తమ పరిధిలో ఎన్ని ఇంకుడు గుంతలు నిర్మించారు? ఎన్ని వినియోగంలో ఉన్నాయి? ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బహుళ అంతస్తుల భవనాల్లో ఏర్పాటు చేశారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.నీటి సంరక్షణ అనేది ఒక్కరోజు కార్యక్రమం కాదు.. భవిష్యత్తు తరాల మనుగడకు సంబంధించిన బాధ్యత. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఇంకుడు గుంతల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, వర్షపు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అక్రమ ఇంటి నెంబర్లు, అనుమతుల వ్యవహారంపై దుమారం

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

అధికార పార్టీ కౌన్సిలర్‌నిరసనతో రాజకీయ దుమారం : అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ వారికి వారసత్వంగా సంక్రమించిన భూమిలో వారు నిర్మించిన షెడ్డు కు వేరొక కౌన్సిలర్ రాజకీయ దుర్వినియోగానికి పాల్పడి మున్సిపల్ అధికారులతో కుమ్మకు అవ్వడంతో మున్సిపల్ అధికారులు షెడ్డు కు ఇంటి నెంబర్ను సృష్టించారని ధర్నాకు దిగిన కౌన్సిలర్ ఆరోపించారు.మున్సిపల్ పాలనలో జరుగుతున్న పరిణామాలపై అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ సైతం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అధికార పార్టీకే చెందిన ప్రజాప్రతినిధి సమస్యను లేవనెత్తడం ద్వారా మున్సిపల్ వ్యవహారాలపై ఉన్న అసంతృప్తి బయటపడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పదవుల అండతో భూకబ్జాలా..? ప్రజలు కట్టబెట్టిన పదవులను అడ్డుపెట్టుకొని కొందరు నేతలు భూవ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు సుల్తానాబాద్‌లో వినిపిస్తున్నాయి.అధికారులతో కుమ్మక్కై వారి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అక్రమాలను యదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, వివాదాస్పద భూముల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో సమస్యలు మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్: ఇంటి నెంబర్ల కేటాయింపు,భవన నిర్మాణ అనుమతులపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.అధికారుల నిర్ణయాల్లో రాజకీయ జోక్యం లేకుండా, అర్హతలు మరియు నిబంధనల ఆధారంగానే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.సామాన్యుడి సమస్యలకు ఒక న్యాయం, పలుకుబడి ఉన్నవారికి మరో న్యాయం అనే భావన తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పారదర్శక విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

చదువే విద్యార్థి ప్రగతికి ఆధారం

(మొదటిపేజీ తరువాయి)

ఆయా సౌకర్యాలు కల్పించారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్పిటల్‌లలో సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. పలు బ్యాంకుల ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద 22 లక్షల రూపాయలతో విద్యార్థుల సౌకర్యార్థం 145 బెడ్స్ , పరుపులు ఏర్పాటు చేయించారు. హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కోటి రూపాయలతో స్మార్ట్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయించారు. త్వరలో జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్వాడీల్లో సీఎస్ఆర్ కింద వసతుల కల్పన మొదలు కానున్నాయి. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వ్యక్తి వికాసం, అభివృద్ధికి చదువు ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఎందరో ఆదర్శ వ్యక్తులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తి చేశారు. బాబాసాహెబ్ డా.బి.ఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వారి విద్యాభ్యాస కాలంలో ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారని దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణమూర్తి భార్య సుధామూర్తి విద్యాభ్యాసం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆదర్శ మూర్తుల ఉన్నత విలువలు, దేశానికి, సమాజానికి అందించిన సేవలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిదాయకంగా తీసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బాధ్యులు శ్రావణ్ కుమార్, నాగేశ్వర రావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ఎం మోతీలాల్, ఏఏపీసీ చైర్‌పర్సన్ తిప్పవరం సుధ, హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డ కౌన్సిలర్ లింగంలపల్లి భాగ్యలక్ష్మీ , దొంతినేని కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/పెంబి : నిర్మల్ జిల్లా పెంబి మండలం రాయదారి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ స్కీడ్ హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన వినోద్ బీహార్ రాష్ట్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నాలుగో ర్యాంకు సాధించారు.దీంతో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆయన ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు నేపాల్ వెళ్లనున్న జాదవ్ వినోద్‌కు భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్ రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి విజయానికి ఆర్థికంగా అండగా నిలిచిన రాథోడ్ రితేష్‌ను పలువురు అభినందించారు.అంతర్జాతీయ పోటీల్లో వినోద్ మరింత ప్రతిభ కనబరిచి దేశానికి,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించి, దేశ విద్యారంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ 1947 నుంచి 1958 వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆయన సేవలకు గౌరవ సూచకంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ట్రెజరర్ అబ్దుల్ సాధిక్,వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో 34 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ప్రొసీడింగ్‌లు అందజేత

ప్రజాపక్షం/ఆర్మూర్ : నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కు మార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఖానాపూర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ బోదాసు నర్సింలు ఆధ్వర్యంలో మొత్తం 34 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్‌లను అందజేసి మాట్లాడారు. పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మగ్గిడి సర్పంచ్ చంద్ర కాంత్‌గౌడ్, ఉపసర్పంచ్ రాజనర్సయ్య, మండల అధ్యక్షులు బద్దం నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సుంకరి రవికుమార్, ఉమ్మెడ నర్సయ్య, సాయమ్మ, శ్రీనివాస్, సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 201011 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు.గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.25 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా రూ.3.50 లక్షల నిధులతో చేపట్టనున్న మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.5 లక్షల చొప్పున నిర్మించనున్న మున్నూరుకాపు, రెడ్డి కుల సంఘ భవనాల నిర్మాణ పనులకుశంకుస్థాపననిర్వహించి పనులను ప్రారంభించారు. మరో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్నసిసి రోడ్డు నిర్మాణ పనులకు కూడాశంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామానికి చెందిన దీటి లావణ్య–రాజయ్య, గడ్డం అంజయ్య–ఈశ్వరి దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో నూతన గృహాలను ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎమ్మెల్యే : ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారిగా చర్లపల్లి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామ సర్పంచ్ మేడిపల్లి వనిత ఆనందరెడ్డి,డిసిసిఅధ్యక్షుడు గాజంగి నందయ్య, గడ్డం నారాయణరెడ్డి, ఎంపిడిఒమాదేవి, తహసీల్దార్ హకీమ్, ఎంపిఒరవిబాబు, డిఇమిలింద్, జిల్లా, మండల సర్పంబొలిశెట్టి గంగారెడ్డి,కట్ట రాజేందర్, ఏఈ విజయ్, మాజీ సర్పంచ్ తిరుపతి,ఉపగ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపిక

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : తెలంగాణ గో సేవా విభాగం ఈనెల 15వ తేదీన హైదరాబాదులోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గో విజ్ఞాన పరీక్షకు నిర్మల్ జిల్లాలోని16పాఠశాలల నుండి129మంది విద్యార్థులు ఎంపికైనట్టు జిల్లా గోసేవ ప్రముఖ్ కొత్తకాపు నారాయణ,జిల్లా గోసేవ టోలీ సభ్యులు డాక్టర్ అల్లాడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతి ఒక లక్ష రూపాయలు,రెండో బహుమతి 50వేల రూపాయలు,మూడవ బహుమతి 25 వేల రూపాయలు,మరికొందరికి ప్రోత్సాహక బహుమతులను రాష్ట్ర గవర్నర్,కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరియు ఇతర ఉన్నత అధికారుల చేతుల మీదుగా బహుమతుల ప్రధానం,సర్టిఫికెట్ల పంపిణీ జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. భారతీయ సనాతన ధర్మంలో గోవు ఒక మూగజీవి మాత్రమే కాదు సమస్త జీవకోటికి ప్రాణ దారమైన జగన్మాత భూమి మీద ఉన్న సమస్త జీవరాశి మనుగడకు మానవజాతి ఆరోగ్యానికి గోవుతో అనుబంధం విడదీయ రానిది.అందుకే ఆవు ప్రపంచానికే తల్లీ లాంటిదని మన వేదాల్లో ఉంది ఈ సత్యాన్ని నేటి తరానికి తెలియజేస్తూ,అంతరించిపోతున్న దేశీ గో వంశాన్ని, గోసంరక్షణ భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో దేశ సంస్కృతిని రక్షించి పర్యావరణాన్ని,ప్రకృతిని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గురు శ్రేష్ఠ అవార్డులకు ముఖ్య అతిథులకు ఆహ్వానం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని గౌరవించే లక్ష్యంతో నవంబర్ 14వ తేదీన నిర్వహించనున్న "గురు శ్రేష్ఠ – ప్రైవేట్ టీచర్స్ అవార్డ్స్" కార్యక్రమానికి ముఖ్య అతిథులను టిఆర్ఎస్ ఎంఎనిర్మల్ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.బుధవారం రోజున నిర్మల్ జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, నిర్మల్ డీఎస్పీ పెండం శ్రీనివాస్‌ను కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి వేదుకను విజయవంతం చేయాలని కోరారు.ఈ ఆహ్వాన కార్యక్రమంలో టిఆర్ఎస్ఎంఎ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు అయ్యన్నగారి శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి జి. శ్యామ్ ప్రకాష్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షబ్బీర్ అహ్మద్,సోన్ సక్సెస్ పాఠశాల కరస్పాండెంట్ అంబేకర్ ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ విద్యారంగానికి విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో గురు శ్రేష్ఠ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరై ఉపాధ్యాయులను ప్రోత్సహించి, అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపునిచ్చే ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టిఆర్ఎస్ఎంఎ నిర్మల్ జిల్లా ప్రతినిధులు తెలిపారు.



వరి కొయ్యలు కాల్చొద్దు.. భూమిలోనే కలియదున్నాలి

ప్రజాపక్షం/ధర్మపురి : వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం ధర్మపురి మండలంలోని అక్కాయిపల్లె గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంతో పాటు ఎల్‌నినో ప్రభావం, యాసంగి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు, మిత్ర పురుగులు నశించడంతో పాటు భూసారం దెబ్బతింటుందని తెలిపారు. విద్యుత్ మోటార్లు, వైర్లు, పైపులు కాలిపోయే ప్రమాదం ఉందని, పర్యావరణ కాలుష్యంతో పాటు పశువులకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అందువల్ల వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని, త్వరగా కుళ్లిపోయేందుకు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ వినియోగించాలని సూచించారు.అలాగే నేల సంరక్షణ,భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, యూరియా, రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ, జీవ ఎరువుల వినియోగం పెంచాలని కోరారు. పంట మార్పిడి, అంతర పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రాబోయే యాసంగిలో వరికి బదులుగా పెసర్లు,మినుములు,సజ్జలు,జొన్నలు,అనుములు,చిరుధాన్యాలు,కూరగాయలు,పొద్దుతిరుగుడు, వేరుశనగ, నువ్వు లు, కుసుమ వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్,ఎఇఒ నవ్య,గ్రామ రైతులు పాల్గొన్నారు.



బి ఫార్మసీలో యూనివర్సిటీ స్థాయి గోల్డ్ మెడల్

ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బిఫార్మసీ)లో అద్భుత ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయి గోల్డ్ మెడల్ సాధించాడు.హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియు) ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు విశ్వవిద్యాలయ స్థాయిలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతేకాకుండా,తన ప్రతిభతో తదుపరి ఉన్నత విద్య అయిన ఫార్మ్‌డీ కోర్సులో ఉచిత ప్రవేశం పొందాడు. ఇమ్రాన్ యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మెట్‌పల్లి పట్టణానికి చెందిన విద్యావంతులు, మేధావులు,ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఇమ్రాన్‌కుఅభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఫార్మసీ రంగంలో మరిన్నిఉన్నతశిఖరాలనుఅధిరోహించిసమాజానికిసేవలందించాలనిఆకాంక్షించారు.

మోడల్ స్కూల్ ఆటస్థలానికి మహర్దశ



ప్రజాపక్షం /పెగడపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల శారీరక దృఢత్వం, క్రీడా నైపుణ్యాల అభివృద్ధి కోసం ఆటస్థలాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎస్ఐ కుమారస్వామి చొరవ చూపారు. పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి ఆటస్థలం సమస్యను ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి జెసిబి యూనియన్ నాయకుల సహకారంతో మైదానాన్ని చదును చేయించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం ఆటస్థలాన్ని చదును చేసే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కుమారస్వామి, మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, సర్పంచ్ అరుణ శ్రీనివాస్, నరసింహునిపేట సర్పంచ్ రాజమణి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బత్తుల ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్,ప్రిన్సిపల్ కొత్త ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కడారి తిరుపతి, మార్కెట్ డైరెక్టర్ చాట్ల భాస్కర్,వార్డు సభ్యులు మల్లేశం, అరుణ్,కారోబార్ స్వామి,జెసిబియూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నవనాథ సిద్ధుల గుట్ట చైర్మన్‌గా రవికుమార్ ప్రమాణ స్వీకారం



ప్రజాపక్షం/ఆర్మూర్ : పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధుల గుట్ట నూతన చైర్మన్‌గా మానకొండ రవికుమార్ (జిమ్మి రవి) బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ని యోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డి హాజరై చైర్మన్‌గా మానికొండ రవికుమార్‌తో పాటు ఆలయ కమిటీ స భ్యులుగా పొద్దుటూరి చరణ్‌రెడ్డి, హాజరి సతీష్, శ్రీనివాస్, మంజుల మురళి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య సలహాదారులుగా భారత్ గ్యాస్ సుమన్, మల్లయ్య, శంకర్, నియమించగా సలహాదారులుగా రామగౌడ్, గంగారెడ్డి, చక్రవర్తి నియమితులయ్యారు. ముఖ్య అతిథులు మార చంద్రమోహన్, సాయిబాబాగౌడ్, మున్సిపల్ చైర్మన్ లహరి రఘు, వైస్‌చైర్మన్ పెద్దకటి పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

108 సిబ్బందికి సన్మానం

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిస్వార్థంగా సేవ లందిస్తూ ఆపద సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్న 108 అత్యవసర వైద్య సేవల సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది ఈఎంటీలు కొత్తపల్లి సాగర్, సుంకరి విజయ్‌కుమార్, పైలట్ తలారి రమేష్‌లకు శాలువలు కప్పి మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సిబ్బంది ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ వైద్య సేవలందిస్తూ సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడటంలో చేస్తున్న సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రమేష్, గంగాధర్, మోహన్, నర్సయ్య, రాజశేఖర్, ప్రదీప్, చంద్రశేఖర్, పవన్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ సీటు సాధించిన ఇషితకు సన్మానం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన సుద్దాల శ్రీధర్ కుమార్తె సుద్దాల ఇషిత ఎంబిబిఎస్ సీటు సాధించడంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇషిత భవిష్యత్తులో వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల రాజేశ్వర్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ పల్లి శేఖర్ గౌడ్, మాజీ ఎంపిటిసిపుల్ల శేఖర్ గౌడ్,డి.రాజు,ఇప్ప జలంధర్,నల్ల నరేందర్ రెడ్డి,భూమయ్య, మ్యాదరి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/పెగడపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా న్ని, ఆరవెల్లి ఉప కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భ ంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ముందుగా ఆసుపత్రిలోని వివిధ రి జిస్టర్లను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న చిన్నారుల టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీకాల పంపిణీ ప్రక్రియ,కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించి,వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను స మీక్షించారు. అలాగే ఆరోగ్య కేంద్రం పరిధిలో గుర్తించిన కుష్ఠు వ్యాధి కేసును స్వయంగా పరీక్షించి, రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వైద్య సేవల అమలు, వ్యాధుల గుర్తింపు, ప్రజారోగ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆరోగ్య కేం ద్రంలో అందుతున్న వైద్య సేవలు,రికార్డుల నిర్వహణ,టీకాల కార్యక్ర మం, వ్యాధుల గుర్తింపు ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ టి అనూష,ఎఎన్ఎం రాజేశ్వరి,ఆశా కార్యకర్తలు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ విడుదల

ప్రజాపక్షం/ధర్మపురి: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చెకుముకి సైన్స్ సంబరాలు–2026' పోస్టర్‌ను బుధవారం కమలాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్లు మ్యాన పవన్ కుమార్, వంశీ మాట్లాడుతూ ఈ నెల 12న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయి సంబరాలు జరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎదుల మహేష్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.17 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లిలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి, చెర్లకొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.5 లక్షలతో చేపట్టనున్న కిచెన్ షెడ్ నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా, డ్రగ్స్‌పై అవగాహన

ప్రజాపక్షం /రాయికల్ : కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోషల్ మీడియా, డ్రగ్స్‌పై అవగాహన ,మోటివేషన్ కార్యక్రమాన్ని మోటివేషనల్ స్పీకర్ మోబిన్, 9వ తరగతి విద్యార్థిని మాన్వి మోబిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సోషల్ మీడియా వినియోగం వల్ల వచ్చే నష్టాలను మాన్వి మోబిన్, మాదకద్రవ్యాల వినియోగం వలన వచ్చేటువంటి అనర్థాలను,వాటి నుండి ఎలా దూరంగా ఉండాలో మోబిన్ విద్యార్థులకి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు , ఉపాధ్యాయులు కృష్ణ హరి,బాపూరావు చిరంజీవి, గంగాధర్,పద్మావతి,స్వప్నలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి రూ.15 లక్షల ప్రమాద బీమా



ప్రజాపక్షం /పెగడపల్లి : పోస్ట్ ఆఫీస్ ద్వారా అందిస్తున్న ఆదిత్య బిర్లా జీవిత బీమా పథకం కింద మండలంలోని నామాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.15 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. సర్పంచ్ చిర్ర రజిత–రమణాకర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందికి బీమా చేయించి, వారికి ఐడికార్డులు, బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రమాద సమయాల్లో ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలగందుల విష్ణు, పంచాయతీ కార్యదర్శి చింత లావణ్య, పోస్టుమాన్ లొడ్యా వెంకటేష్ పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే రైతుకు భవిష్యత్తు



ప్రజాపక్షం/పెంబి: పెంబి మండలం గుమ్మెల యంగ్లాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (ఏవో) నవీన్, ఏఈవో జగదీశ్వర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం నేల ఆరోగ్యాన్ని కాపాడటం, భూసారాన్ని పెంచడమేనని అన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలని సూచించారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి నిస్సారమై పంట దిగుబడులు తగ్గుతాయని హెచ్చరించారు.సుస్థిర సాగుకు మార్గాలు నీటి వనరులను పరిరక్షించుకోవాలి,సహజ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి,ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ పాటించాలి,రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ వాడాలి,రైతులు తమ పొలాల్లో కలుపు నివారణకు, చీడపీడల నివారణకు సహజ పద్ధతులను అవలంభించాలని,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ లో పాక్స్ ఆధ్వర్యంలో అదేవిధంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆధ్వర్యంలో వర్షకొండలో వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసిల్దార్ బిఎస్ఎస్. వరప్రసాద్ సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న,యామాపూర్ సర్పంచ్ కనుక నగేష్,వర్ష కొండ సర్పంచ్ ఫోన్ కంటి వెంకట్, ఎఫ్. పి.ఓ చైర్మన్ కుంబాల రాజారెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, నిబంధనల ప్రకారం ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2461 బి గ్రేడ్ రకానికి 2441మద్దతు ధరతోపాటు సన్నవడ్లకు బోనస్ రూపకంగా ప్రభుత్వం క్వింటాల్ కు 500 రూపాయలు చెల్లిస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్,సహకార అడాప్షన్ ఆఫీసర్ ఎండీ నిజాముద్దీన్,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, ఎఫ్.పి.ఓ సీఈవో తాండ్ర శ్రీధర్, కుంట రాంప్రసాద్ గౌడ్,రావుల గణేష్,రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాపక్షం /రాయికల్ : రాయికల్ పట్టణంలోని 3వ వార్డులో గల సీడెం భీం మైదానంలో ఆర్‌డిపిల్ ఎంసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ (సీజన్–1) బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగ శ్రావణి ప్రవీణ్, రాయికల్ మాజీ సర్పంచ్, బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మచ్చ నారాయణ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ చిన్న ధర్మపురి కలిసి టాస్ వేసి టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రీడలు యువతలో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడానికి ఇలాంటి జిల్లా స్థాయి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్లో 14 మండలాల నుండి 14 జట్లను ఎంపిక చేసామని అన్నారు. 11 నవంబర్ బుధవారం రోజున ప్రారంభమైన ఈ టోర్నమెంట్ ఈనెల 30వ తారీకు లోపు వరకు కొనసాగుతుందని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదికగా ఆర్‌డిపిల్ ఎంసిసి సీజన్–1 నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రథమ విజేత జట్టు క్రీడాకారులకు రూ.50 వేల నగదు బహుమతిని బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీమతి భోగ శ్రావణి ప్రవీణ్ చేతుల మీదుగా అందజేయనున్నారు. ద్వితీయ విజేత జట్టు క్రీడాకారులకు రూ.30 వేల నగదు బహుమతిని మచ్చ నారాయణ చేతుల మీదుగా అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడుఆకుల మహేష్, పట్టణ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడుఅన్నవేణి వేణు,దిశ కమిటీ సభ్యుడుభుక్యా నాయక్, బన్న సంజీవ్, మచ్చ శ్రీధర్,సామల్ల సతీష్,లింగ చంద్రశేఖర్,సుంకెవంశీ, కొల నరేష్,ఫైజల్,తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనే లక్ష్యం

ప్రజాపక్షం/కోరుట్ల : భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న మహనీయుడు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (11 నవంబర్) ను పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎంఎ నయీమ్ పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం జాతీయ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ చైర్మన్ ఎంఎ నయీమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నౌనిహాల్ ఉర్దూ మీడియం హైస్కూల్‌తో సహా పలు ప్రభుత్వ ప్రైమరీ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమెంటోలు అందజేశారు.ఈ సందర్భంగా నయీమ్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం, ఆయన అనుసరించిన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యను సమాజ అభ్యున్నతికి ప్రధాన సాధనంగా భావించిన ఆజాద్, స్వాతంత్ర్యం అనంతరం దేశ విద్యారంగానికి పటిష్టమైన పునాదులు వేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాల సాధనకు విద్యా ప్రోత్సాహం, సామాజిక సేవ, మత సామరస్యం వంటి కార్యక్రమాల ద్వారా ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ వసంత గంగాధర్, 21వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ షహనాజ్ రిజ్వానా, 2 వ వార్డు కౌన్సిలర్ హుమెరా వాసిద్,17 వ వార్డు కౌన్సిలర్ సోగ్రా బీ, 18 వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ రహీం, 4వ వార్డు కౌన్సిలర్ తెడ్డు శిరీష విజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముజీబుర్ రహమాన్, మైనారిటీ నాయకులు రిహాన్, ఫెరోజ్ యువకులు సాజిద్,సూఫియాన్,అజాన్ రజా,ముస్తాఖీమ్,అశ్రార్,ఆకిఫ్, విద్యార్థులు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ 108వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 108వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బ్యాంకు ఆవరణలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ జొంజల్ కుషల్ సురేష్, ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ బ్యాంకు మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ బ్యాంక్ మేనేజర్ విద్యాసాగర్, లోన్ ఆఫీసర్ వైభవ్ గైక్వాడ్, అసిస్టెంట్ మేనేజర్ సృజన,బ్యాంకు సిబ్బంది పణి రాజ్ గౌతమ్,ముత్యం రాజ్ కుమార్,రవీందర్,వినోద్,ముత్యం, చంద్రప్రకాష్, బ్యాంకు వినియోగదారులు,తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉన్న వారు జీవితంలో రాణిస్తారు: శ్రీహరి

ప్రజాపక్షం/మాక్లూర్ : క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో దేనినైనా సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్వతేజస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తిరుగగరి శ్రీహరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో మండలంలోని మదన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ ఉన్న వారు జీవితంలో రాణిస్తారన్నారు. పరీక్ష ల్లో తక్కువ మార్కులు రావటం ఓ అవరోధం మాత్రమేనని ఓ అంతిమ నిర్ణయం కాదన్నారు. పాఠ్యాంశాలను ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర బాబు, గంగాదాస్, రాజేందర్, శివలింగం పాల్గొన్నారు.

మృతుల కుటుంబం పరామర్శ

ప్రజాపక్షం /రాయికల్ : రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ రెడ్డి,అయోధ్య గ్రామానికి చెందిన ప్రసాద్, సింగరావుపేట గ్రామంలో రాజన్న మనవరాలు మరణించడంతో బుధవారం ఆయా కుటుంబాలను మాజీ మంత్రి,బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించి వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ,వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



ప్రజాపక్షం /పెగడపల్లి : మండలంలోని నందగిరి తెనుగువాడ ఎంపిపిఎస్ పాఠశాలలో బుధవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాట్ల వెంకటేశం మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యావేత్తగా,స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. విద్య అనేది కేవలం అక్షర జ్ఞానం మాత్రమే కాదని, మనిషి జీవితాన్ని మార్చే గొప్ప శక్తి అని పేర్కొన్నారు. హిందూ, ముస్లిం ఐక్యతకు, జాతీయ సమైక్యతకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో భారతరత్న పురస్కారంతో గౌరవించిందని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థినులు,విద్యార్థులు పాల్గొనిమౌలానా అబుల్ కలాం,ఆజాద్ సేవలను స్మరించుకున్నారు.

రైతులు ఆధునిక, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలి

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో 'ఖేతీ బచావో అభియాన్' అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి జె.అనూష ముఖ్య అతిథిగా పాల్గొని, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. రైతులు నీటిని పొదుపుగా వాడుతూ బిందు, తుంపర సేద్య పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు.తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఒంగోలు, గిర్, సహివాల్ వంటి దేశవాళీ పశు జాతులను పెంచుకోవడం ద్వారా పాల దిగుబడిని పెంచుకోవడంతో పాటు, పశువుల పేడను సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలి. మైదంబండ గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్, ఏఈఓ బి. శశిధర్, స్థానిక రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : భూసార పరిరక్షణే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేతీ బచావో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొదురుపాక గ్రామంలో రైతులకు భూసార పరిరక్షణ, ఎల్నినో ప్రభావం, ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు (టెక్నికల్) కాంతారావు మాట్లాడుతూ వరి కొయ్యకాలను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్ని సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని సూచించారు.అలాగే వర్మీ కంపోస్టు తయారీ విధానం,ఆయిల్ పామ్,కూరగాయల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలను వివరించారు.వ్యవసాయ విస్తరణ అధికారి డి. ప్రశాంత్ మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి పంటకు బదులుగా మొక్కజొన్న, జొన్న, నువ్వులు, వేరుశనగ, అపరాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయా పంటల సాగు విధానాలు, నిర్వహణపై రైతులకు వివరించారు.కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరిఖిల్ల శాస్త్రవేత్త డా. వినోద్ పాల్గొని భూసార పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. రైతులు తమ పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించి వ్యవసాయ శాఖకు అందజేస్తే వాటిని ప్రయోగశాలకు పంపించి పరీక్షించి ఫలితాలను అందజేస్తామని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగాదిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయాలు కూడా తగ్గుతాయని సూచించారు.గ్రామ సర్పంచ్ సట్టు ఉత్తమకుమారి,వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి రవీందర్,పాల్గొన్నారు.

దేవస్థాన పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఐటియుసి కార్మిక సంఘం వినతి



ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔటోసోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అనుబంధ వేములవాడ దేవస్థాన కాంట్రాక్టు, ఔటోసోర్సింగ్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించినట్లు కడారి రాములు పేర్కొన్నారు. దేవస్థానంలో దాదాపు 200 మంది పారిశుద్ధ్య కార్మికులు గత 15 నుంచి 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి ఆలయ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల ద్వారా వేతనాలు చెల్లించడం వల్ల తమకు రావాల్సిన పూర్తి వేతనం అందడం లేదని, కేవలం సగం వేతనం మాత్రమే అందుతోందని కార్మికులు ఆరోపించారు. కాంట్రాక్టు వ్యవస్థను తొలగించి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేవాదాయ శాఖ ద్వారా గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్ కార్డులు అందించాలని, రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పదవీ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యం కల్పించడంతోపాటు రోజుకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అదనపు పని గంటలకు అదనపు వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ రాజన్న ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆలయ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరడం జరిగింది.

రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: వ్యవసాయ మార్కెట్ కమిటి పాలక వర్గ సభ్యులు రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవ భావంతో పనిచేయాలని రాజన్నసిరిసిల్లా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సూచించారు.మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ నంది కిషన్ డైరక్టర్లు తమకు లభించిన పదవులను భాధ్యతగా భావించి రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు.రైతులు ఏ సమస్యతో ఫోన్ చేసినా స్పందించాలని ప్రజాప్రతినిధులు పాలక వర్గ సభ్యులు తమ దృష్టికి సమస్యలు దృష్టికి వస్తే అందుబాటులో ఉండాలన్నారు.రైతులు పండించే పంటకు గిట్టుబాటు అందేలా కృషి చేస్తమని చెప్పారు.పశువులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు కృషి ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు గ్రామిణ ప్రాంతలకు అందే విధంగా చూడాలని అన్నారు.ఇందిరమ్మ ఆళ్ళు,చేయూత పించన్లు,పేదలఇండ్లలో దీపావళి పండుగ జరుపుకునే పరిస్థితులు కల్పించడమే లక్ష్యమని అన్నారు.కార్యక్రమంలో నూతనంగా నియమితులైన బొప్పాపురం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ మేడిపల్లి దేవనందం,వైస్ చైర్మెన్ నంది కిషన్ డైర్ట క్టర్లు పాల్గొనగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారయణ,సర్పంచ్ గీతాంజలి,మండలధ్యక్షులు సుడిద రాజెందర్,నర్సయ్య,సద్దిలక్ష్మారెడ్డి,రాంరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,మండల అధికారి రాజ శేఖర్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రమశిక్షణ, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని పెద్దపల్లి డీసీపీ బి. రామిరెడ్డి పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో గర్రెపల్లి ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ బి. రామిరెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడటమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. ప్రవచనకర్త ఎస్పీ నాయక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దూరంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.ఈ అవగాహన సదస్సులో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ నివారణపై అవగాహన పెంపొందించుకున్నారు.

విద్యా రంగానికి బలమైన పునాది మౌలానా

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



ప్రజాపక్షం/పెద్దపల్లి : భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం,జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, 1888 నవంబర్ 11న సౌదీ అరేబియాలోని మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అని, అబుల్ కలాం అనేది ఆయన బిరుదు కాగా ఆజాద్ అనేది ఆయన కలం పేరు అని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుడైన ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి, అరబిక్,ఇంగ్లీష్,ఉర్దూ,హిందీ, పెర్షియన్,బెంగాలీ వంటి అనేక భాషలలో ప్రావీణ్యుడని పేర్కొన్నారు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు పనిచేసిన ఆయన నిరుపమాన సేవలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం 2008లో ఆయన జన్మదినమైన నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు.

వేములవాడ మార్కెట్ పరిధిలో పత్తి కొనుగోళ్లు ఎప్పుడు?

ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పత్తి పంటలో సగం దిగుబడి చేతికి వచ్చినప్పటికీ ప్రభుత్వ కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎల్వోసి మంజూరు..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లికి చెందిన పాశం నారయణరెడ్డికి సీఎం రిలిఫ్ ఫండ్ నుండి రెండు లక్షల ఇరవై వేల రూపాయలు మంజూరైనట్లుగా గొల్లపల్లి సర్పంచ్ కొండరమేష్ గౌడ్ ప్రకటనలో తెలిపారు.వారం రోజుల క్రితం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యఖర్చుల నిమిత్తం ఎల్వోసి మంజూరు చేయించినందుకు రాజన్నసిరిసిల్లా ఎంఎల్‌ఏ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో జెడ్పి విద్యార్థుల విద్యా కుసుమాలు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : తెలంగాణ సారస్వత పరిషత్ రెండు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన వివిధ సాహితి పోటీలలో పద్య రచన విభాగంలో పసునూరి దివ్య జ్యోతి తొమ్మిదో తరగతి రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి,దీటి హర్షిణి తొమ్మిదవ తరగతి ప్రోత్సాహక బహుమతి పొందారు,ఈ సంధర్భంగా బుధవారం మీడియా ప్రకటన చేశారు.చిన్నారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహరచారి ,సర్రఅంజన్‌రెడ్డి,బిక్కునాయక్,న్యాత రమేష్ ఉపాధ్యాయ బృందం,గ్రామ సర్పంచ్ సర్సింహులు,అమ్మ ఆదర్శ పాఠశాల లత గ్రామస్థులు విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

శుభకార్యాల్లో సర్పంచ్

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కొలిపాక పద్మశంకర్ దంపతుల కుమారుడు అనిల్, అఖిలల నిశ్చితార్థ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణఉపేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి,వారు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అకోజు అశోక్ చారి,యూత్ సభ్యుడు కొలిపాక ప్రవీణ్,తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

అల్లం నారాయణ మాతృమూర్తికి బిజెపి నాయకురాలు కందుల సంధ్యారాణి నివాళి

ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ,ప్రముఖ రచయిత అల్లం రాజయ్య,అల్లం వీరయ్యల మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులయ్యారు.పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు దుండె మల్లేష్,ఎరుకల సంఘం నాయకులు ఉగ్గే కుమార్,చంద్రమౌళి,భక్తుల రమేష్,పలువురు బీజేపీ నాయకులు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై మరో అధికారి ఆర్టిఐ అస్త్రం!

ప్రజాపక్షం/ముత్తారం : సాధారణంగా ప్రభుత్వ అధికారుల పనితీరుపై సామాన్య ప్రజలు,రాజకీయ నాయకులు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరడం చూస్తుంటాం. కానీ, ఇందుకు భిన్నంగా ఒక ప్రభుత్వ అధికారి మరో ఉద్యోగిపై ఆర్టీఐ దరఖాస్తు చేయడం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రవీందర్, అదే మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న బుచ్చయ్యపై ఆర్టీఐ ద్వారా సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.? ఒక పంచాయతీ కార్యదర్శి మరో గ్రామానికి చెందిన బిల్ కలెక్టర్‌పై ఆర్టీఐ కింద వివరాలు అడగడం మండల వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఈ పరిణామం వెనుక ఉన్న అసలు కారణాలు తెలియాల్సి ఉంది.

మూడేళ్లుగా సాగిన వసూళ్ల పర్వం.. మొత్తం ఎంత?

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజాపక్షం/పెద్దపల్లి ః కుందనపల్లి ఎన్టీపీసీ బూడిద రవాణా లారీల నుంచి గత మూడేళ్లుగా ఒక్కో ట్రిప్పునకు రూ.500 చొప్పున వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా, జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండానే లారీల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ మూడేళ్లలో మొత్తం ఎంత సొమ్ము వసూలు చేశారు? ఆ డబ్బు ఎవరికి చేరింది? అనే ప్రశ్నలను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ లేవనెత్తారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లిలోని ఎన్టీపీసీ బూడిద చెరువు నుంచి అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు లారీల ద్వారా బూడిదను రవాణా చేస్తున్నారు. అయితే ఈ రవాణా మార్గంలో కంటైనర్ ఏర్పాటు చేసి, స్థానిక రెవెన్యూ సిబ్బంది పేరుతో ఒక్కో లారీ ట్రిప్పునకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ప్రస్తుతం వసూళ్ల కంటైనర్‌ను తాత్కాలికంగా తొలగించినట్లు చర్చ జరుగుతోంది. ఒక్కో లారీకి రూ.500 చొప్పున వసూలు చేస్తూ మూడేళ్లపాటు ఈ వ్యవహారం కొనసాగితే ఇప్పటివరకు ఎంత మొత్తం చేతులు మారి ఉంటుందనే అంశంపై చందర్ ప్రశ్నలు సంధించారు. రోజుకు ఎన్ని లారీలు రాకపోకలు సాగించాయి? మొత్తం ఎన్ని ట్రిప్పులు జరిగాయి? మూడు సంవత్సరాల్లో ఎంత డబ్బు వసూలైంది? ఈ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది? అనే వివరాలను అధికార యంత్రాంగం బయటపెట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాకుండా లారీ రవాణాపై డబ్బులు వసూలు చేసే అధికారం ఎవరిచ్చారు? ప్రభుత్వ అనుమతి లేకుండా మూడేళ్లుగా ఈ వసూళ్లు జరిగితే సంబంధిత అధికారులు ఇంతకాలం ఏం చేస్తున్నట్లు? ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని గుర్తించి ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



కలెక్టర్, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి ః ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ స్పందించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా వసూళ్లు జరిగాయా? జరిగితే అందుకు బాధ్యులెవరు? మూడేళ్లలో ఎంత మొత్తం వసూలు చేశారు? ఆ సొమ్ము ఎవరికి చేరింది? అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అవసరమైతే సీబీఐ, డీఓపీటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ కోరుతానని చందర్ స్పష్టం చేశారు. కంటైనర్ తొలగింపుతో ఈ వ్యవహారాన్ని మరుగున పడనీయకుండా, మూడేళ్ల వసూళ్ల పూర్తి లెక్కలు ప్రజల ముందుంచి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓడేడ్ ప్రధాన రహదారిపై భారీ గుంతలు



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ నుండి మంథని వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా ఓడేడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు భాగంలో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ గుంతల కారణంగా నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా సంబంధిత ఆర్.అండ్ బీఅధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రిక్షా ర్యాగ్ పిక్కర్ల సమస్యలు పరిష్కరించండి

ఆర్.ఎం.సి కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన ఎఐటియుసి నాయకులు

ప్రజా పక్షం/పెద్దపల్లి ః రామగుండం మున్సిపల్ కార్పొరేషన్లో గత 27 సంవత్సరాలుగా రిక్షా ర్యాగ్ పిక్కర్లు ఇంటింటి చెత్త సేకరణ కార్మికులుగా పని చేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలంగాణా రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి రామగుండం యూనిట్ ప్రధాన కార్యదర్శి ఎం ఎ గౌస్ పేర్కొన్నారు. బుధవారం వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ లో పని చేస్తున్న కార్మికులు వివిధ మహిళా గ్రూపుల నుంచి వచ్చిన వారేనని, వీరు సుమారు 202 మంది వరకు రిక్షా ర్యాగ్ పిక్కర్ లు గా శానిటేషన్లో ఔట్ సోర్సింగ్ చెత్త ఊడ్చే కార్మికులుగా, చెత్త ఎత్తే కార్మికులుగా తీసుకుని విధులు నిర్వహిస్తున్నారని, మిగిలిన వారిని కూడా తీసుకుంటామని చెప్పారని, కాని అప్పటి నుంచి గత పాలకులు చేయని పనుల్లో మన పాలకులు చేయరని, ఇప్పుడున్న వారిని అవుట్ సోర్సింగ్ కార్మికులుగా నియమిస్తారని ఆశతో



ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ర్యాగ్ పిక్కర్ కార్మికులను శానిటేషన్, స్వీపర్ కార్మికులుగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకుంటారని కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు.అదే విధంగా 142 మంది రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికుల్లో కొంత మంది అనారోగ్యా గారైనందున వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు పని చేస్తున్నారు. వారి పేర్లను అనెన్ చేయవల్సిందిగా కోరుతున్నాము. దీంతో పాటు మన నగర పాలక సంస్థలో ఓనర్ కం డ్రైవర్ పైలెట్ ఏజెత్సలను తొలగించాలి. మేము 27సంవత్సరాల పని చేస్తున్నందున మమ్మల్ని ఔట్ సోర్సింగ్ కార్మికులుగా తీసుకోవాలని కోరుతున్నాము.అదేవిధంగా రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికులను శానిటేషన్, స్వీపర్, లోడింగ్ అన్ లోడింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని, పైలెట్ ఏజెన్సీ(ఓనర్ కం డ్రైవర్) విధానాన్ని రద్దు చేయాలని, వారి స్థానంలో పాత వారిని యధావిధిగా కొనసాగించాలని, ఔట్ సోర్సింగ్ జవాన్లు (సూపర్వైజర్ లు) వేధింపులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలని,రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికులకు గతంలో మాదిరిగానే యూనిఫాం అందించాలని తదితర డిమాండ్ లపై వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు, కార్పొరేషన్ అధికారులు స్పందించి రిక్షా రాక్ పిక్కర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిక్షా రాక్ పిక్కర్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో అనేక సంస్కరణలకు ఆధ్యుడు అబుల్ కలాం ఆజాద్

ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం / కొత్తపల్లి ః విద్యారంగంలో అనేక సంస్కరణలకు ఆధ్యుడు అబుల్ కలాం ఆజాద్ అని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని షే సాహెబ్ కాలనీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన అబుల్ కలాం ఆజాద్ జయంతోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1947 నుంచి 1958 వరకు సుమారు 11 సంవత్సరాల పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆజాద్ విద్యా రంగంలో అనేక చారిత్రక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కలాం జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, జాతీయ మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు పాడ్స్, కంపాక్స్, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ ఖాన్, ఇంచార్జీ హెచ్ఎం ఆసియా, ఇమ్రాన్ ఘని, అర్బన్ డిసిసి జనరల్ సెక్రటరీ సత్తినేని శ్రీనివాస్, అర్బన్ డిసిసి జనరల్ సెక్రటరీ కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం

ప్రజాపక్షం / గన్నేరువరం ఃి గన్నేరువరం మండలంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఎంపిడివో శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో సాయి కృష్ణారెడ్డిలు నూతనంగా ఎన్నుకోబడిన బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్ తోపాటు డైరెక్టర్లు నందికొండ తిరుపతి రెడ్డి, మైసంపల్లి తిరుపతి, దేశరాజ్ అనిల్, జెల్ల రాజేశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు, సర్పంచ్ మ్యాదరి శ్రీనివాస్, రాపాక బాబు, పారువెల్ల సర్పంచ్ లక్ష్మీ రాంరెడ్డి, చీమలకుంటపల్లె సర్పంచ్ ప్రకాశ్, ఖాసీంపేట సర్పంచ్ కర్నె చంద్రయ్య, నంది కొండ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం / గంగాధర ఃి మండలంలోని కురిక్యాల పిఏసీఎస్ కార్యాలయంతోపాటు గర్షకుర్తిలోని రైతు వేదికల్లో బుధవారం వ్యవసాయ శాఖ, కేవీకే జమ్మికుంట ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త విజయ్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలని రసాయన ఎరువులను నేల పరీక్షల ఆధారంగా సమతుల్యంగా వాడాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు, పచ్చి రోట్ట, జీవ ఎరువుల వినియోగం పెంచాలని, పంట మార్పిడి విధానంతో పోషక సమతుల్యత కాపాడుకోవచ్చని వివరించారు. పశుగ్రాస సాగు, పాడి సంపదపై ప్రత్యేకంగా



అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలొనినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని అన్నారు. నీటి లభ్యత తక్కువ ఉన్న చోట మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశనగ, పొద్దు తిరుగుడు, నువ్వులు వంటి తక్కువ నీటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడారి రేణుక కనుకయ్య, ఉప సర్పంచ్ గుండారపు మహేశ్, ఏఈఓలు వెంకట్, గోపిచంద్, పిఏసీఎస్ సీఈవో విక్రమ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ ఇటెక్నోలో కలాం జయంతి వేడుకలు

ప్రజాపక్షం/కొత్తపల్లి ః భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర చాలా విశిష్టమైందని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో కలాం జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మహానీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యారంగం అగ్రగామిగా ఉండడానికి ప్రధాన కారణం కలాం అని పేర్కొన్నారు. దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను నెలకొల్పి విద్యార్థులకు చేయూతనిచ్చిన మహానీయుడు కలాం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఎంపిక



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : నవంబర్ 12 నుంచి 15 వరకు వికారాబాద్ జిల్లాలో జరగనున్న 36వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలురు కబడ్డీ పోటీలకు సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి గుర్రం అనుదీప్ ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వ్లలారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి గుర్రం అనుదీప్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పల్లె ఉమ, అకడమిక్ ఇంచార్జి షాహిద్, వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, నవీన్‌లు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాద బాధితుడిని పరామర్శించిన బండి సంజయ్



ప్రజాపక్షం / మానకొండూర్ : మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబటి తిరుపతి రాజుకు రోడ్డు ప్రమాదం జరుగగా బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, రంగు భాస్కరాచారి, గ్రామ సర్పంచ్ వాల ప్రదీప్ రావు, మాజీ ఎంపిటీసీ నాగయ్య, దూలం కిరణ్, చిట్యాల లక్ష్మ య్య, రావుల శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, తిక్క దేవేందర్, రావుల వెంకట రాజం, ముల్కల శ్రీనివాస్, పిట్టల ఆంజనేయులు, ఎనగందుల సంపత్, కాట సంపత్, కాట శంకర్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి అండ్వెంచర్ క్యాంపుకు అర్జున్ ఎంపిక

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నవంబర్ 17 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి అడ్వెంచర్ క్యాంపుకు శాతవాహన విశ్వ విద్యాలయం తరపున కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కాంపెల్లి అర్జున్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ డా.అర్జున్‌ను అభినందిస్తూ విశ్వ విద్యాలయం తరపున కళాశాలకు ప్రాతినిధ్యం వహించడం గర్వ కారణమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్యలతోపాటు స్టాఫ్ క్లబ్ సెక్రటరీ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

భూముల రీసర్వేపై రైతులు అవగాహన పెంచుకోవాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : భూముల రీసర్వేపై రైతులు కనీస అవగాహన పెంచుకోవాలని క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ సమయంలో అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ అన్నారు. గంభీరావు పేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే ప్రక్రియ చేపడుతున్న బృందం భూముల వివరాలను ఖచ్చితత్వంతో సేకరించాలని రైతులకు భూముల రీ సర్వేపై అవగాహన కల్పించాలని అన్నారు. పారదర్శకంగా రైతుల సమక్షంలో భూముల రీ సర్వే చేయాలని ఆదేశించారు. ఎన్నినో నేపథ్యంలో రైతులు ప్రభుత్వ ఆదేశానుసారం ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్, ఇతర కూరగాయల పంటలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్న రైతుల అనుభవాలను తెలుసుకోని సాగు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మారుతి రెడ్డి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ఆజాద్ చిత్ర పటానికి, పెద్దపల్లి రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అహ్మద్‌పురాలోని షాషాబ్ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పోరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ చేతులమీదుగా పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఖాన్‌పూర్‌లోని గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ విద్య అందించాలనే గొప్ప ఆశయంతో కలాం దేశ విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు పెరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, పురుమల్ల శ్రీనివాస్, పిసిసి అధికార ప్రతినిధి సిరాజ్ హుస్సేన్, ఎస్.ఎ.మోసిన్ కిమ్ ఫహద్, కొరివి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు తక్షణ పోస్టింగ్‌లు కల్పించాలి



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 558 మంది ఉద్యోగులను రిలీవ్ చేసినప్పటికీ వారికి తదుపరి పోస్టింగులు కేటాయించడంలో జాప్యం చేయడంపై తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ జిల్లా బాధ్యులు ఎస్.నన్నీ ఎడ్వర్డ్, ఎం.ఏ.అతీక్ లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని విమర్శించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోకి బదిలీ ప్రక్రియలో భాగంగా రిలీవ్ అయిన 558 మంది ఉద్యోగులకు వెంటనే స్పష్టమైన పోస్టింగులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సర్వీస్ హక్కులు, సీనియారిటీ, జీతభత్యాలు, పదోన్నతులు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు ఏలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు యూనియన్ ప్రతినిధులతో చర్చించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ ఆధ్వర్యంలో తదుపరి కార్యచరణ చేపడతామని హెచ్చరించారు.

నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరమైన కళాశాల



ప్రజాపక్షం / జమ్మికుంట : కే.శే. కె.వి.నారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయమని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ నన్న రామస్వామి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వ్యవస్థాపకులు కే.శే.కెవి.నారాయణ రెడ్డి విగ్రహాన్ని ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో 1965లో నారాయణ రెడ్డి జమ్మికుంటలో ఆదర్శ కళాశాల పేరు మీదుగా కళాశాలను స్థాపించారని అన్నారు. జమ్మికుంట లో కళాశాలను ఏర్పాటు చేయడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. నాటి నుంచి నేటి వరకు వేల విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. అలాంటి గొప్ప నాయకుడు ఈ కళాశాలను స్థాపించి ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాడని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.బి.రమేశ్, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మీర్ అహ్మద్ హుస్సేన్, మొలుగూరి సదయ్య, మైస మహేందర్, అన్వర్ బాబు, డా.కె.రాజేంద్రం, బచ్చు భాస్కర్, శివకుమార్, ఆకుల రాజేందర్, టి.రాజ్ కుమార్, జగదీశ్వర్, సయ్యద్ సజ్జు, ప్రసాద్, సుధాకర్, సాయికుమార్, అరుణ్ రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

సిపిఐ నాయకుల డిమాండ్



ప్రజాపక్షం / గన్నేరువరం : గన్నేరువరం మండలంలో వడ్లు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే పరికోతలు మొదలై కేంద్రాలకు వడ్లు వస్తున్నాయని అన్నారు. రైతులు దగ్గర దళారులు తక్కువ ధరకే పంట కొనుగోలు చేసి దగా చేస్తున్నారని అన్నారు. దళారులు తూకం వేసే పద్ధతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఇప్పటికైనా మండలవ్యాప్తంగా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చొక్కుల శ్రీశైలం, మండల సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గన్నేరువరం గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, బొమ్మకంటి ఆంజనేయులు చారి, మండల నాయకులు ఎండి నయీమ్, బుట్ల భాస్కర్, రాపోలు, రాజమల్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆరుగురు అధ్యాపకులు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. కళాశాల విద్యాశాఖ కమీషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యాశాఖ జాయింట్ యాక్షన్ కమిటీ, టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు డా.కడారు సురేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ పదోన్నతులు కళాశల కీర్తిప్రతిష్టలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కలువకుంట రామకృష్ణ పదోన్నతులు పొందిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేనలకు సురేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు, బోదనేతర సిబ్బంది పదోన్నతి పొందిన అధ్యాపకులను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

ప్రజాపక్షం/శంకరపట్నం: మండల పరిధిలోని తాడికల్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి రాగి తీగ దొంగలించినట్లు విద్యుత్ శాఖ అధికారులు కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో బుదవారం ఫిర్యాదు చేశారు.తాడికల్ సెక్షన్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న రావుల సంపత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం తాడికల్ గ్రామంలో ఎన్ఎస్ 87/25ట్రాన్‌ఫార్మర్‌ను ధ్వసం చేసి కాపర్ వైర్‌ను దొంగలించినట్లు జూనియర్ లైన్‌యెన్ సమాచారం అందించగా తమ సిబ్బందితో కలిసి పరిశిలించగా ట్రాన్స్‌ఫార్మర్ లోని సుమార్ 20 కిలోల కాపర్ వైర్ దొంగలించబడినట్లు గుర్తించారు.దాని విలువ సుమారు 15000 విలువ ఉంటుందని ఏఈ సంపత్ రెడ్డి తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అర్హుల జాబితా విడుదల

ఈ నెల 16 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాపక్షం/కరీంనగర్ః కరీంనగర్ జిల్లాలోని మూడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్ వాడి టీచర్ పోస్టులకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 16 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అర్హుల, అనర్హుల జాబితాను గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించవలసిందిగా, డప్పు చాటింపు ద్వారా గ్రామ ప్రజలకు తెలియజేయాలని సర్పంచ్, కార్యదర్శులకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీసు బోర్డుల ప్రదర్శించిన అర్హుల, అనర్హుల జాబితాను పరిశీలించవలసిందిగా సూచించారు. ఐసిడిఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 8 అంగన్వాడీ టీచర్ల పోస్టులకు సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామపంచాయతీలకు (కొత్తపల్లి మండలం, కరీంనగర్ రూరల్), మున్సిపల్ కార్యాలయానికి పంపినట్లు సిడిపిఓ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు భగత్ నగర్, ట్రినిటీ బాయ్స్ కాలేజీ పక్కన గల సిడిపిఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలు ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబోమని తెలిపారు.

హుజూరాబాద్ పరిధిలో..

ఐసిడిఎస్ హుజురాబాద్ ప్రాజెక్టు పరిధిలోని 16 అంగన్వాడీ టీచర్ల పోస్టులకు సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలకు పంపినట్లు సిడిపిఓ ప్రవళిక ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు హుజూరాబాద్ కెసి క్యాంపు, దమ్మక్కపేట రోడ్డులో గల సిడిపిఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబోమని తెలిపారు.

గంగాధర ప్రాజెక్టు పరిధిలో..

ఐసిడిఎస్ గంగాధర ప్రాజెక్టు పరిధిలోని 20 అంగన్వాడీ టీచర్ల పోస్టులకు సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామ పంచాయతీలకు (గంగాధర, రామడుగు, చొప్పదండి మండలలో) మరియు మున్సిపల్ కార్యాలయానికి పంపినట్లు సిడిపిఓ నర్సింగ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సిడిపిఓ, ఐసిడిఎస్ గంగాధర ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలు ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబోమని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సమాజ నిర్మాణం

ప్రజాపక్షం/ వరంగల్ టౌన్ : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రముఖ సామాజికవేత్త, “ఐ లవ్ రీడింగ్ – ఐ లైక్ లైబ్రరీ” కార్యక్రమ ఫౌండర్ నిమ్మల శ్రీనివాస్ విద్య, పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. విద్య అనేది వ్యక్తి జీవితంలో వెలుగులు నింపే శక్తి అని, పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆలోచనా విధానాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించడం, ప్రతి ఒక్కరికీ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడడం సమాజ బాధ్యత అని అన్నారు.ఇళ్లలో అవసరం తీరిన పుస్తకాలను నిరుపయోగంగా ఉంచకుండా అవసరార్థులకు, పాఠశాలలు, కళాశాలలు, గ్రం థాలయాలకు డొనేట్ చేయాలని నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పుస్తక దానం ద్వారా మరొకరికి విజ్ఞానాన్ని అందించవచ్చని, పుస్తకాలు అవసరమైన గ్రంథాలయాలు, విద్యార్థులు, సంస్థలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి 9949709866 నంబర్‌ను సంప్రదిస్తే ఎక్కడ ఏ పుస్తకాలు అవసరమో వాటి వివరాలను తెలియజేస్తానని తెలిపారు. పుస్తక పఠనాన్ని ఉద్యమంగా మార్చి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

రామంజపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ గుండెపోటుతో మృతి

ప్రజాపక్షం/ వెంకటాపూర్ : మండలంలోని రామానుజపురం ఫీల్డ్ అసిస్టెంట్ నిమ్మల నరసయ్య గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం నరసయ్య ఉపాధి పనుల పని ప్రదేశానికి వెళ్లగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్న సర్పంచ్ అశోక్ కూలీలు వెంటనే సిపిఆర్ చేసి ములుగు ఆసుపత్రికి తరలించారు. దహన సంస్కరణలకు మండల పరిషత్ కార్యాలయం నుండి 20 వేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఒ షాజిదా, మల్లంపల్లి ఏపీవో నారగాని సునీత, పంచాయతీ సెక్రటరీలు నాగరాజు, రజనీకర్, మహేందర్, గీత, రేవతి, ఫీల్డ్ అసిస్టెంట్లు రామాచారి ,భాస్కర్, సారంగపాణి, నాగరాజు, సునీత ,రాధిక , మాజీ ఎంపీపీ ఆషాడపు దేవేందర్ ,మాజీ సర్పంచ్ తుమ్మేటి రాజిరెడ్డి గ్రామంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొంటాం

మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి



ప్రజాపక్షం / మానకొండూర్ ః రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఏలాంటి ఆందోళన చెందవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని దేవంపల్లి సొసైటీ, ఊటూరు సొసైటీ ఆధ్వర్యంలో లక్ష్మీపూర్, దేవంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తేమ లేకుండా కేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధరతోపాటు సకాలంలో డబ్బులు అందేలా చూస్తామని తెలిపారు. దళారుల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ఊటూరు సొసైటీ చైర్మన్ ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, దేవంపల్లి చైర్మన్ రొంటాల లక్ష్మారెడ్డి, సర్పంచులు ఎడ్ల సత్యనారాయణ, బండారుపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, వరాహాల చారి, జీడీ శ్యాంసుందర్, గూడాల మహేందర్ గౌడ్, బుర్ర శ్రీధర్ గౌడ్, ఎడ్ల శ్రీధర్, రాపాక రాజేశ్వర్, నందికొండ రామిరెడ్డి, మండల సంపత్ రెడ్డి, సీతఈపోలు మిట్టపల్లి రవీందర్, కసిరెడ్డి మల్లిఖార్జున్ రెడ్డి, డైరెక్టర్లు, రైతులు, హామాలీలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో ఎఐ శిక్షణ కేంద్రం ఏర్పాటు



ప్రజాపక్షం / ఇల్లందకుంట ః రాబోయే ఐదేళ్లలో విద్య, వ్యవసాయం, వైద్యం సహా అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక మార్పులు తీసుకురానుందని యాప్ టీవీ అధినేత ఉదయానందన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం ఏఐ సాంకేతికతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇల్లందకుంట మండల కేంద్రంలో ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆరో తరగతి విద్యార్థుల నుంచి ఉన్నత విద్య అభ్యసిస్తున్న యువతకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. గతంలో వీణవంకలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని త్వరలో హుజూరాబాద్ కేంద్రంగా కూడా ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఉదయానందన్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట గ్రామ సర్పంచ్ దారా సురేశ్, ఉప సర్పంచ్ పెరుమాండ్ల రంజిత్, ఇల్లందకుంట దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కంకణాల సురేందర్ రెడ్డితోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమం ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైంది.ఈ సందర్భంగా గ్రామ ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు చదువుపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాపక్షం/హనన్ పర్తి : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రైతురాజు 1వ డివిజన్ పలివెల్పుల ఒఆర్ఆర్ వద్ద నిర్మిస్తున్న నూతన గృహ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గృహ నిర్మాణానికి శుభారంభం పలికారు. అనంతరం రైతు రాజు, వారి సతీమణికి నూతన గృహ నిర్మాణం విజయవంతంగా పూర్తయి, సుఖసంతోషాలతో వారి కుటుంబం కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట దేవస్థానం చైర్మన్ పైడిపాల రఘు చందర్, హసన్పర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజేష్ రెడ్డి, మండల అధ్యక్షులు అశోక్, మాజీ కార్పొరేటర్ జానీ శిబారాణి అనిల్, మాజీ పాక్స్ చైర్మన్ బుద్దే పెద్దన్న, సీనియర్ నాయకు బైరీ లింగమూర్తి, బిజిలి సంపత్, గాదె రాము,ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్



ప్రజాపక్షం/భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, బొక్కల స్రవంతి, పూసకోయిల ప్రకాష్, మొండయ్య, రమేష్, సతీష్, శారద, అశోక్, చింత రాజు, జక్కుల అనిల్, వెంకటేష్, వ్యవసాయ శాఖ ఎఒ, ఎఇఒ, గ్రామ కార్యదర్శి, సిసి సదానందం, సిఎలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలి



ప్రజాపక్షం/తొర్రూరు: కార్తీక మాసం ప్రారంభమైన సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంచారామాలకు, శబరిమల, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు తొర్రూరు డిపో నుండి అద్దె ప్రాతిపదికన అతి తక్కువ చార్జీలతో సురక్షితంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తొర్రూరు డిపో మేనేజర్ కె.ప్రసూనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచారామాలలో అమరావతి(అమృతేశ్వరాలయం) , భీమవరంలోని సోమేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వరాలయం, ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం, సామర్లకోటలోని కుమార రామ భీమేశ్వరాలయం, శబరిమల, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే భక్తులు పూర్తి వి వరాల కోసం తొర్రూరు డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నా రు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.